క్లుప్తంగా

ఇంటర్‌లో నాగేశ్వరి ప్రతిభ



నాగేశ్వరి (445)

తాళ్లరేవు: ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షల్లో తాళ్లరేవు జూనియర్ కళాశాల విద్యార్థిని సంగాడి నాగేశ్వరి ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు 445 మార్కులు సాధించి ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరిని అధ్యాపక బృందం అభినందించారు. గత విద్యాసంత్సరంలో తమ కళాశాలలో 80 శాతం ఉత్తీర్ణత సాధించామని, సప్లిమెంటరీ ఫలితాల అనంతరం 87 శాతానికి ఉత్తీర్ణత పెరిగిందన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

తాళ్లరేవు: ఉపాధి కూలీల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసారు. మండుతున్న ఎండల్లో కష్ట పడి పని చేసే కూలీలకు సక్రమంగా వేతనాలు చెల్లిస్తేనే వారి కడుపు నిండుతుందని రెండు నెలలుగా కూలీ అందక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో కూలీలకు పనిముట్లు ఇచ్చేవారని, వేసవిలో పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు వేసేవారని, ప్రమాదవశాత్తూ గాయపడితే వెంటనే ప్రథమ చికిత్స చేయడం కోసం మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచేవారని, అయితే ప్రస్తుతం అవేమీ ఉండడం లేదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏడుకొండలు డిమాండ్ చేసారు.

అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా నిర్మల్‌కుమార్



అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన నిర్మల్‌కుమార్

అమలాపురం టౌన్: మున్సిపల్ కమిషనర్‌గా వి.నిర్మల్‌కుమార్ నియమితులయ్యారు. నిర్మల్ కుమార్ ప్రస్తుతం అమరావతి డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ అమలాపురం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈయన గతంలో తాడేపల్లి, బాపట్ల మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా పనిచేశారు. అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన కేవీఆర్‌ఆర్ రాజు ఇదే జిల్లాలోని రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక అధికారిణి బి.రాణి సంయుక్త ఫుల్ అడిషనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే. కొత్త కమిషనర్ నిర్మల్‌కుమార్ మరో మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారని తెలిసింది.

చెత్త డంపింగ్‌పై ప్రజల ఆగ్రహం



ఇందుపల్లి వద్ద చెత్తను వేస్తున్న పారిశుధ్య సిబ్బంది

అమలాపురం రూరల్: ఇందుపల్లి గురువు అప్పర్ కౌశిక బ్రిడ్జి వద్ద బండారులంక గ్రామ పంచాయతీకి చెందిన చెత్తను డంప్ చేయడంపై ఇందుపల్లి గురువు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం బండారులంక పారిశుధ్య సిబ్బంది ట్రాక్టర్లతో చెత్త తెచ్చి ఇందుపల్లి వంతెన పక్కనే వేయడాన్ని వారు అడ్డుకున్నారు. ఇక్కడ చెత్త వేయడం వల్ల అప్పర్ కౌశిక పూడుకుపోతుందన్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారని, చెత్త వల్ల దుర్గంధం వ్యాపిస్తుందని ఇందుపల్లి గురువు గ్రామస్తులు ఆందోళ వ్యక్తం చేశారు. తక్షణమే చెత్త డంపింగ్‌ను అధికారులు అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు కేటాయించకుండా పథకాల ప్రకటన

యానాం: పుదుచ్చేరిలో బీజేపీ, ఎన్‌ఆర్ కాంగ్రెస్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సీఎం రంగసామి నేతృత్వంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా పలు ప్రజాకర్షక పథకాలను ప్రకటిస్తోందని మంగళవారం ఏఐఏడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు.

మాజీ సైనికుల పిల్లల చదువుకు సహకారం

యానాం: మాజీ సైనికుల పిల్లల చదువుకు యానాం ప్రభుత్వం సహకారం అందిస్తోందని అధికారులు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి యానాం నియోజకవర్గ పరిధిలో మాజీ సైనికుల పిల్లల చదువులకు ట్యూషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాం తదితర వాటికి ప్రభుత్వం అలవెన్స్‌లు ఇవ్వనున్నట్లు అధికారులు ప్రకటించారు. అర్హులందరూ తమ దరఖాస్తులను ఆగస్టు 22లోగా పంపాలని, డైరెక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్, పుదుచ్చేరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను సైనిక్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని జూలై 27లోపు పంపాలన్నారు. ఆర్‌ఏఓ ఆఫీసు నుంచి కూడా దరఖాస్తులను తీసుకోవచ్చన్నారు.

‘సాక్షి’పై దాడి చేసిన వారిని శిక్షించాలి



అమలాపురం పట్టణ సీఐ వీరబాబుకు ఫిర్యాదు చేస్తున్న అమలాపురం సాక్షి విలేకరులు

అమలాపురం టౌన్: సాక్షి కార్యాలయాలపై దాడులు చేసిన కూటమి నాయకులపై చర్యలు తీసుకుని శిక్షించాలని కోరుతూ అమలాపురంలోని విలేకర్లు పట్టణ సీఐ పి.వీరబాబుకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. సాక్షి పత్రిక స్టాఫ్ రిపోర్టర్ నిమ్మకాయల సతీష్, పాత్రికేయులు పరసా సుబ్బారావు, అరిగెల రుద్ర శ్రీనివాసరావు తదితరులు సీఐ వీరబాబుకు ఫిర్యాదు పత్రాలు అందజేశారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకే సాక్షిపై దాడులు

ఉప్పలగుప్తం: పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై దాడులు చేస్తున్నారని, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నేత కుంచే రమణారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమరావతి అంశంపై సాక్షి చానల్‌లో ప్రసారమైన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభిస్తుంటే, మరో వైపు సాక్షి కార్యాలయాలపై టీడీపీ కార్యకర్తలు తెగబడి ఆస్తులను ధ్వంసం చేసి అధికార దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. పత్రికా కార్యలయాలపై దాడులు చేయడం హేయమైన చర్య అని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, ప్రభుత్వ విధానాలను ఎండగట్టుతున్న సాక్షిపై అక్కసుతో ప్రభుత్వం కక్ష సాధింపునకు పాల్పడుతోందని రమణారావు అన్నారు. సంబంధంలేని విషయాలను సాకుగా చూపి సాక్షిపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దాడులకు పాల్పడిన టీడీపీ రౌడీ మూకలపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



కుంచే రమణారావు

కొనసాగుతున్న ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మె



అమలాపురంలో సమ్మె శిబిరం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు

అమలాపురం టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మె కొనసాగుతోంది. 34 రోజులుగా అమలాపురం మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 50 మంది ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పట్టణంలో ఇంజినీరింగ్ వర్కర్లు విధులు బహిష్కరించి సమ్మెలో ఉండడం వల్ల పలు వార్డుల్లో తాగునీటి సమస్యలు, వెలగని వీధి దీపాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ పట్టణంలోని ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. ఉదాహరణకు స్థానిక వడ్డిగూడేనికి తాగునీటి సరఫరా లేకపోవడంతో మున్సిపాలిటీ అయిదు రోజుల కిందట ఓ ట్యాంకర్‌తో తాగునీరు పంపించింది. తర్వాత మళ్లీ ట్యాంకర్ పంపించకపోవడంతో అక్కడి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు అరకొరగా అందే ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకుని పొదుపుగా వాడుకునే పరిస్థితి వారికి అనివార్యమైంది. ఇలా పట్టణంలోని పలు వార్డుల్లోని ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. పలు వార్డుల్లో వీధి దీపాలు వెలగక రాత్రి వేళలో అంధకారం అలుముకుంటోంది.

ఈ- విధాన్ యాప్ ప్రారంభం

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీని పేపర్‌లెస్ అసెంబ్లీగా తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన ఈ–విధాన్ యాప్‌ను మంగళవారం కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ ప్రారంభించారు. ప్రజలకు అసెంబ్లీ ప్రొసీడింగ్స్‌పై అవగాహన కల్పించడంతోపాటు అన్ని అసెంబ్లీలను పార్లమెంట్‌కు అనుసంధానం చేసే విధానంలో భాగంగా ఈ-విధాన్ యాప్‌ను దశల వారీగా దేశ వ్యాప్తంగా అమలులోకి తీసుకువస్తామన్నారు. యాప్ వినియోగంపై ఎమ్మెల్యేలకు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్యదర్శులకు త్వరలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రంగసామి, స్పీకర్ సెల్వం, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి పాల్గొన్నారు.

అద్భుత శిల్పకళతో వెంకన్న ఆలయ నిర్మాణం

- అడ్డంకులు అధిగమించి వేగంగా పనులు
- టీటీడీ ఆధ్వర్యంలో నిర్మాణం
- రెండవ దశ పనులకు రూ.9.03 కోట్ల ఖర్చు
- శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ.3 కోట్లు మంజూరు
- దేవస్థానం కమిటీ రూ.2.71 కోట్లు జమ



ముందుభాగంలో వెంకన్న ఆలయ నిర్మాణ పనులు



ఆకట్టుకుంటున్న ఉత్తరభాగం నిర్మాణ పనులు



రాతి స్తంభాలతో ఆలయ నిర్మాణం

యానాం: సుమారు 600 ఏళ్లనాటి రెడ్డిరాజులు నిర్మించిన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం అవసాన దశకు వచ్చిన నేపథ్యంలో కూల్చివేసిన దాని స్థానంలో నూతన ఆలయం అద్భుతమైన శిల్పకళా రీతిలో తమిళనాడు నుంచి తీసుకువచ్చిన రాతితో కట్టడం పనులు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు ఆధ్వర్యంలో త్వరితగతిన సాగుతుండటంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో ఏడాదిలో పనులు పూర్తయ్యి భక్తుల దర్శనానికి ఆలయం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. అనేక వివాదాలు, సమస్యలను అధిగమించి ఇప్పటికే మొదటి దశ నిర్మాణం పూర్తి కావడంతో రెండవ దశ పనులు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా టీటీడీ బోర్డు యానాం వెంకన్న ఆలయ పనులకు నిధులు కేటాయించడంతో శ్రీకారం చుట్టారు.

రెడ్డిరాజుల నిర్మాణం.. కల్యాణపురంగా ఖ్యాతి

కాకతీయులు పతనానంతరం రెడ్డిరాజుల ఆవిర్భావం జరిగిందని చరిత్ర చెబుతుంది. రెడ్డిరాజులు సాహిత్య, కళారంగాలను పోషించారు. కొండవీటి రెడ్డిరాజులలో ఒకడైన కుమారగిరిరెడ్డి తన బావ కాటయ వేమారెడ్డి శౌర్యసాహసాలకు మెచ్చి రాజమహేంద్రవరం ప్రాంతాన్ని అప్పగించారు. ఆయన కాలంలోనే యానాంలో శ్రీభూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణమైంది. 15వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయం పురాతనమైనదిగా చెబుతారు. కూల్చివేసిన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం చారిత్రక, పురాతన ప్రాశస్త్యం కల్గినది. అంతేగాక తిరుపతి వేంకటేశ్వరుని ఆలయం కంటే ముందుగానే ఇక్కడ మీసాల వెంకన్నను ప్రతిష్ఠించినట్లు చెబుతారు. 1929లో బ్రిటీష్ ప్రభుత్వం బాల్యవివాహాలను నిషేధిస్తూ శారదా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో సరిహద్దునున్న ఫ్రెంచి పాలిత యానాంలో ఆ చట్టం పట్టింపులేకపోవడంతో అక్కడ నుంచి ఎక్కువగా మీసాల వెంకన్న ఆలయం వద్ద బాల్యవివాహాలు ఎక్కువగా జరగడంతో యానాంను కల్యాణపురంగా పిలిచేవారు.



యానాంలో కొలువైన మీసాల వెంకన్న స్వామి

రెండవ దశ ఆలయ నిర్మాణానికి రూ.9.03 కోట్ల ఖర్చు

వెంకన్న ఆలయ నిర్మాణంలో భాగంగా రెండవ దశ నిర్మాణానికి రూ.9.03 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఆ మొత్తానికి ఇటీవలి తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి దేవస్థానం (టీటీడీ) బోర్డు ఆమోదం తెలిపింది. అందులో సుమారు రూ.5.50 కోట్ల వరకు పనులను టీటీడీ పూర్తి చేస్తుంది. మిగిలిన పనులు యానాం వెంకన్న దేవస్థానం కమిటీ చేసుకోవాల్సి ఉంది. ఈ అయిదున్నర కోట్లలో మొదటి దశగా టీటీడీ రూ.1.90 కోట్లను డోనర్ అకౌంట్ నుంచి దేవస్థానానికి డిపాజిట్ చేయడానికి టీటీడీ సమావేశంలో నిర్ణయించారు. మొదటి ఫేజ్‌లో దాతలు, భక్తులు రూ.17.83 లక్షల విరాళాలు ఇచ్చారు. అదేవిధంగా శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ.3 కోట్ల నిధులు అందించారు. యానం దేవస్థానం టీటీడీ బోర్డుకు రూ.2.71 కోట్లు ఫస్ట్‌ఫేజ్‌లో జమ చేశారు. మొదటి ఫేజ్ నిర్మాణానికి రూ.7కోట్లు ఖర్చు అయ్యింది. రెండవ దశలో ఆలయ నిర్మాణానికి పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి సైతం నిధులు అడిగారు. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నారు.

> **చురుగ్గా ఆలయ నిర్మాణం**
>
> 
>
> టీటీడీ బోర్డు ఆధ్వర్యంలో యానాం వెంకన్న ఆలయం నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. వచ్చే ఏడాదిలోగా భక్తుల దర్శనానికి ఆలయాన్ని సిద్ధం చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేస్తున్నాం. భక్తులు, దాతలు విరాళాలు ఇచ్చి ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్నారు.
>
> – మల్లాడి కృష్ణారావు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా మల్లాడి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావును టీటీడీ బోర్డు సభ్యుడిగా అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిఫార్సు చేశారు. దీంతో మల్లాడి కృష్ణారావు యానాం వెంకన్న ఆలయానికి టీటీడీ బోర్డు ద్వారా నిధులు సాధనకు మార్గం సులభమైంది. దీంతో ఆ పదవిని ఆయన సద్వినియోగం చేసుకున్నారు. తమిళనాడు వద్ద నున్న తిరుచ్చి సమీపంలో నల్లరాతిని ఆలయ నిర్మాణానికి ఉపయోగిస్తున్నారు.

గణేశ్వరికి షైన్ స్టార్ పురస్కారం



కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే సత్యనారాయణ చేతుల మీదుగా షైన్ స్టార్ పురస్కారాన్ని అందుకుంటున్న గణేశ్వరి

అమలాపురం టౌన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 596 మార్కులు సాధించిన స్థానిక శ్రీవాగ్దేవి స్కూలు విద్యార్థిని పిచ్చిక జాహ్నవి నాగ సాయి గణేశ్వరికి షైన్ స్టార్ పురస్కారం లభించింది. ప్రభుత్వం ప్రకటించిన ఈ పురస్కారంతో పాటు రూ.20 వేల నగదు బహుమతిని గణేశ్వరి అందుకుందని ఆ స్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ పురస్కారాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా అమలాపురంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గణేశ్వరి అందుకుంది. శ్రీవాగ్దేవి స్కూలు డైరెక్టర్ పరసా భరత్, హెచ్‌ఎం పి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు గణేశ్వరిని మంగళవారం అభినందించారు.

కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన



తాండవపల్లిలో చట్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్, అంగన్‌వాడీ సిబ్బంది

అమలాపురం రూరల్: కిషోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగి, మంచి ఆలోచనలతో భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలం తాండవపల్లి, చిందాడగరువు గ్రామాల్లో మంగళవారం కిషోర్ వికాసం–2 కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.అన్నపూర్ణేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కిషోర బాలికా వికాసం కార్యక్రమానికి చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 14 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన బాలికలు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గంగుమళ్ల ఏసుబాబు, పొనకల గణేష్, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఉప్పలగుప్తం: కౌమార దశలో ఉన్న బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు అన్నారు. మునిపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర వికాసం–2పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



వాటర్ వర్క్స్ విభాగాన్ని పరిశీలించి ఇంజినీర్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో కుళాయిల నుంచి మురికి నీరు వస్తోందని ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల బృందం వాటర్ వర్క్స్ విభాగాన్ని మంగళవారం సందర్శించి పరిశీలించింది. కొన్ని ప్రాంతాల్లో కుళాయిల నుంచి మురికి నీరు ఎందుకు వస్తుందన్న విషయంపై కౌన్సిలర్లు ఆరా తీశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ సమ్మెలో ఉండడం వల్ల, వాటర్ వర్క్స్‌కు వెనుక ప్రాంతంలో ఉన్న రెండు తాగునీటి చెరువుల్లో ఓ చెరువులో నీరు పూర్తిగా అడగంటడం వల్ల ఈ దుస్థితి ఎదురుతోందని కౌన్సిలర్లు గుర్తించారు. ఈదరపల్లి వంతెన నిర్మాణం వల్ల పంట కాలువలకు నీరు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యం ప్రభావం మున్సిపాలిటీ తాగునీటి సరఫరాపై తీవ్రంగా పడుతోందని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 15వ తేదీ లోపు పంట కాలువలకు నీరు ఇస్తే మున్సిపాలిటీకి రిజర్వాయర్లకు నీరు అందుతుందని వారన్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, నాగారపు వెంకటేశ్వరరావు, బండారు గోవిందు తదితరులు బృందం తాగునీటి పర్యవేక్షణ ఇంజినీరు సూర్యభాస్కరరావుతో వాటర్ వర్క్స్ సిబ్బంది లోనే చర్చించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు యండమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కర్ర సాములో సోదరీమణుల ప్రతిభ



జ్యోత్స్న, సత్యశ్రీ, తల్లిదండ్రులను అభినందిస్తున్న గురువులైన పురోహిత సోదరులు

అమలాపురం టౌన్: రాష్ట్రస్థాయి కర్ర సాము (చెడీ తాలింఖానా) పోటీల్లో ఇద్దరు సోదరీమణులు సత్తా చాటి ఆరు పతకాలు సాధించి ప్రశంసలందుకుంటున్నారు. అమలాపురంలోని పురోహిత సోదరుల వద్ద వారు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా స్థానిక అన్నాబత్తుల వారి వీధిలో శిక్షణ ఇచ్చిన గురువుల ఇంటి ప్రాంగణంలో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. అంబాజీపేట (మాచవరం) శివారు కొత్తపాలెంనకు చెందిన 7వ తరగతి చదువుతున్న 12 ఏళ్ల రాయుడు జ్యోత్స్న కర్రసాములో 4 బంగారు పతకాలు, ఒక రజత పతకం, ఆమె చెల్లెలు 5వ తరగతి చదువుతున్న 9 ఏళ్ల రాయుడు సత్యశ్రీ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. వీరు అమలాపురంలోని పురోహిత సోదరులైన చెడీ తాలింఖానా ప్రావీణ్యులు ఉపద్రష్ట విమలాదిత్య, మహేంద్ర ఆదిత్య, విజయాదిత్య వద్ద కర్ర సాములో శిక్షణ పొందారు. పతకాలు సాధించిన ఇద్దరి సోదరీమణుల తల్లిదండ్రులు రమేష్, సౌజన్య తమ పిల్లలతో అమలాపురం వచ్చి గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆడ పిల్లలకు ఆత్మ రక్షణగా అక్కరకు వచ్చే కర్ర సాము విద్యలో అమలాపురంలోని గురువులు శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని తమ ఇద్దరు ఆడపిల్లలను వారి వద్దకు శిక్షణకు పంపించానని తండ్రి రాయుడు రమేష్ చెప్పారు. తమ పిల్లలిద్దరూ కర్ర సాములో రాష్ట్రస్థాయిలో ఆరు పతకాలు సాధించడం ఆనందంగా, గర్వంగా ఉందని వారన్నారు. గుంటూరు సమీపంలోని పెద నందిపాడులో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన సోదరీమణులు జ్యోత్స్న, సత్యశ్రీని గురువుల సోదరుడైన పురోహిత బ్రహ్మ, పంచాంగ కర్త ఉపద్రష్ట నాగాదిత్య ప్రత్యేకంగా అభినందించారు. ఆత్మ రక్షణకు ఉపయోగపడే కర్ర సామును ఆడపిల్లలకు నేర్పించిన వారి తల్లిదండ్రులు అభినందనీయులన్నారు. నేటి సమాజంలో ఆడ పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలకు విధిగా కర్రసాములో శిక్షణ ఇప్పించాలని నాగాదిత్య విజ్ఞప్తి చేశారు.

మద్రాసు హైకోర్టు జడ్జికి సత్కారం



మద్రాసు హైకోర్టు జడ్జి మాలను మర్యాద పూర్వకంగా కలసిన ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: మహాకవి శ్రీశ్రీ, సరోజా శ్రీశ్రీల చిన్నకుమార్తె, మద్రాసు హైకోర్టు జడ్జి టీఎస్ మాల మంగళవారం యానాం ప్రభుత్వ అతిథిగృహంలో బస చేయడంతో ఆమెను రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. జస్టిస్ మాల మద్రాసు లా కళాశాలలో న్యాయవిద్యను అభ్యసించారు. అనంతరం 1989లో తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్‌లో తన పేరును రిజిస్టర్ చేయించుకున్నారు. 2008 నుంచి పుదుచ్చేరి రాష్ట్ర అడ్వకేట్‌గా సుమారు 12 ఏళ్లపాటు 2020 వరకు వ్యవహరించారు. పుదుచ్చేరి యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాల ప్యానల్ కౌన్సిల్‌కు ఏఎఫ్‌టీగా, ఐసీఏమ్‌ఆర్‌లకు చెన్నై, మధురై బెంచ్‌లకు ప్యానల్ కౌన్సిల్‌గా సైతం వ్యవహరించారు.

ఎంవీఐ సేవలు అభినందనీయం

అమలాపురం రూరల్: పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి కాకినాడకు బదిలీపై వెళ్తున్న కాశీ విశ్వేశ్వరరావును లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీటీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ అమలాపురంలో కాశీ విశ్వేశ్వరరావు వాహనాదారులకు ఉత్తమ సేవలు అందించారన్నారు. రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి వాకపల్లి స్వామి నాయుడు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఉప్పలగుప్తం: మద్యం అలవాటు మానుకోమని తల్లిదండ్రులు మందలించడంతో యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైందని ఎస్సై సీహెచ్.రాజేష్ మంగళవారం తెలిపారు. గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రుకు చెందిన అవివాహితుడైన కమిడి సురేష్ (25) ఈనెల 7న పురుగు మందు తాగాడు. కుటుంబీకులు అతడిని అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతిని సోదరుడు రాంబాబు మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో తేలుతున్న చేపలు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ వాటర్ వర్క్స్‌కు సరఫరా అయ్యే ఓ తాగునీటి చెరువులో నీరు అడుగంటడంతో చనిపోయిన చేపలు తేలుతున్నాయి. చెరువులోని చేపలు చనిపోయి తేలుతుంటే నీరు కలుషితమవుతుందని మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి తేలుతున్న చేపలను తక్షణమే తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చెరువులో చేపలు చనిపోవడంతో ఆ పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని తెలిపారు. తాగునీటి చెరువులో చనిపోయిన చేపలు తేలడంపై వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ చైర్మన్ కుంచే వెంకట రమణారావు ఆందోళన వ్యక్తం చేశారు.

టీఎల్‌ఎంతో సులభంగా బోధన

ముమ్మిడివరం: టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం)తో దివ్యాంగ చిన్నారులకు సులభతర బోధన సాధ్యమవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ పేర్కొన్నారు. మండలంలో ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశపు హాలులో మంగళవారం ఐఈఆర్‌పీలకు టీఎల్‌ఎం వినియోగంపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. సమగ్ర శిక్షా సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సలీంబాషా, మమ్మీ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ఆకట్టుకొనేలా బోధన చేయాల్సిన బాధ్యత ఐఈఆర్‌పీలపై ఉందన్నారు. సహిత విద్యా జిల్లాకో ఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని 22 భవిత కేంద్రాలకు రూ.1.60 లక్షల విలువైన టీఎల్‌ఎం కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఐఈ కోఆర్డినేటర్ సత్యనారాయణ సేవలను ప్రశంసిస్తూ సత్కరించారు. అనంతరం టీఎల్‌ఎం నిపుణులు సీహెచ్ చంద్రసూర్యం, రాయుడు నాగస్వర్ణలు, టీఎల్‌ఎం తయారీ, వినియోగంపై వివరించారు. సమగ్ర శిక్షా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, సీఎంవో బీవీవీ సుబ్రమణ్యం, ఏఎంవో పి.రాంబాబు, ఏపీవో డాక్టర్ ఎంఏకే బీమారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పరిధిలోని చినవలసలలో ఇటీవల అగ్నిప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన బాధితులకు తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యుడు, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం బాధితులు మల్లాడి రాంబాబు, భవానీలను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా నగదుతో పాటు బియ్యం, దుస్తులు, స్టీలు సామగ్రిని అందజేసారు. గ్రామస్తులు సామ్యూల్ సాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.